

# విరిసిన నందివర్ధనం

**రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం.. తండ్రి ఫుట్‌పాత్‌పై చాయ్ అమ్ముతుంటే.. తల్లి ఇళ్లలో పనికివెళ్తుంది.. పొట్ట కూటికే ఇన్ని తిప్పలు పడుతున్న ఆ తల్లిదండ్రులు ఇక పిల్లల కలలు నెరవేర్చడం అంటే మాటలా! కానీ కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్న చందంగా.. పసి ప్రాయం నుంచే పరుగును ప్రేమించి.. కలలను సాకారం చేసుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించిన ఆ చిన్నారి అంతర్జాతీయ స్థాయిలో మువ్వన్నెల పతాకన్ని రెపరెపలాడించింది. తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో వికసించిన ఆ క్రీడా కుసుమమే.. అగసర నందిని!! ఎన్నో అవమానాలు, మరెన్నో ఆటుపోట్లను భరించి.. అడ్డంకులు దాటుకుంటూ ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన నందినితో నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ..**

**ఆసియా క్రీడల్లో పతకం నెగ్గడం ఎలా అనిపిస్తున్నది?**

జాతీయ స్థాయిలో పలు పతకాలు నెగ్గినా.. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడటం అంటే మామూలు విషయం కాదు. అలాంటిది ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన తొలిసారే కాంస్యం నెగ్గడం చాలా సంతోషంగా ఉంది. పోటీలకు ముందు రోజు అసలు నిద్రే పట్టలేదు. నా మనసు నిండా మెడల్ ఆలోచనలే.

**పతకం సాధిస్తారని ఊహించారా?**

ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో పతకం సాధిస్తానని ముందే ఊహించడం కష్టం. అందులోనూ చైనా అథ్లెట్లతో పోటీపడుతూ ముందుకు సాగడం మరీ క్లిష్టమైన పని. కానీ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ముందుకు సాగాలనుకున్నా. అనుకున్నట్లే అన్నీ క్రీడాంశాల్లో మెరుగైన ప్రదర్శన చేశా దీంతో పతకం గెలువగలిగా.

**కుటుంబ నేపథ్యం ఏంటి?**

మా నాన్న ఎల్లప్ప ఫుట్‌పాత్‌పై టీ స్టాల్ నడుపుతుండే వారు. అమ్మ ఇళ్లలో పనికి పోయి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేది. చదివిపించడమే కష్టమైన తరుణంలో గురుకుల విద్యాలయాల రూపంలో నాకు చక్కటి వేదిక లభించింది. వ్యాయమ ఉపాధ్యాయులు నన్ను బాగా ప్రోత్సహించేవారు. అలా స్టేట్ మీట్ నుంచి సౌత్ జోన్ స్థాయి వరకు సత్తాచాటా. ఆ తర్వాత జాతీయ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ సార్ దృష్టిలో పడ్డా. ఇక అక్కడి నుంచి నా పరుగు మారిపోయింది. ఇప్పుడు మా నాన్న చిన్న హోటల్ పెట్టుకున్నాడు.

**హెప్టాథ్లాన్‌పై ఎప్పటి నుంచి మక్కువ?**

కెరీర్ ఆరంభంలో కేవలం పరుగే నా లక్ష్యంగా ఉండేది. రోజుకు 4 గంటల పాటు తీవ్రంగా శ్రమించే దాన్ని అది గుర్తించిన రమేశ్ సార్.. నన్ను 800 మీటర్స్‌లో మెరుగ్గా తీర్చిదిద్దారు. దీంతో పాటు హర్డిల్స్, లాంగ్‌జంప్‌లోనూ ప్రవేశం ఉండటంతో.. ఆసియా క్రీడల్లో హెప్టాథ్లాన్‌లో పోటీపడ్డా. నాలుగు నెలల నుంచి నిద్రాహారాలు మాని శ్రమించా. రోజుకు 10 గంటలకు పైగా ట్రాక్‌పై కష్టపడ్డా.

**తొలిసారే పతకం నెగ్గడంపై కామెంట్?**

గతంలో అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నా.. అయితే సీనియర్ స్థాయిలో నా కెరీర్‌లో ఇదే తొలి అంతర్జాతీయ టోర్నీ. కాస్త బెరుకుగా అనిపించిన మాట నిజమే అయినా.. కోచ్ రమేశ్ సార్, భారత స్పోర్ట్స్ సమాఖ్య ప్రతినిధులు, షాజీ సార్, లక్ష్మణ్ సార్, శ్రీధర్ సార్, మృదుల మేడమ్ ప్రోత్సాహంతో ముందడుగు వేశా. ఈ పోటీల కోసం సిద్ధమవుతున్న సమయంలో మా పెదనాన్న చనిపోయినా వెళ్లలేకపోయా. ఇక ఏషియన్ గేమ్స్ దగ్గర పడ్డాక మా తాత కన్నుమూశారు. ఆయనను చివరిసారి చూడలేకపోయా.

**కెరీర్‌లో గురుకులాల పాత్ర ?**


చిన్నప్పుడు గురుకుల పాఠశాలలో చదవకపోయి ఉంటే ఈ స్థాయికి చేరేదాన్ని కాదు. సోషల్ వెల్ఫేర్ నుంచి ప్రోత్సాహం లభించడం వల్లే క్రీడలకు కెరీర్‌గా ఎంపిక చేసుకున్నా. గోపీచంద్ అకాడమీలో అడుగుపెట్టాక నాపై నాకు నమ్మకం పెరిగింది.

**హెప్టాథ్లాన్‌లో పోటీ ఎలా అనిపించింది?**

వివిధ క్రీడాంశాల సమాహారం కావడంతో ఒకదాంట్లో వెనుకబడ్డా.. మరో దాంట్లో పుంజుకోవచ్చు అనుకున్నా.. కానీ చైనా అథ్లెట్ జెంగ్ నినాలీ, ఉజ్బెకిస్థాన్ ప్లేయర్ వొరోనినా నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. షాట్‌పుట్, హైజంప్, జావెలిన్‌త్రోలో మెరుగైన ప్రదర్శన చేయలేకపోయా. దీంతో కాస్త ఆందోళనకు గురయ్యా. అయితే 200 మీటర్లు, 800 మీటర్ల పోటీల్లో అగ్రస్థానంలో నిలిచి లెక్కసరిచేశా.

**ప్రభుత్వ సహకారం ఎలా ఉంది?**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నది. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ప్లేయర్లకు సీఎం కేసీఆర్ నజరానాలు అందించడం.. అథ్లెట్లలో స్ఫూర్తి నింపుతున్నది. ఈ స్థాయికి చేరేందుకు తోడ్పడిన వాళ్లందరికీ ధన్యవాదాలు .



| | |
|---|---|
| 200 మీటర్లు | 24.47 సెకన్లు |
| 800 మీటర్లు | 2:15.33 సెకన్లు |
| 100 మీ. హర్డిల్స్ | 14.01 సెకన్లు |
| హైజంప్ | 1.61 మీటర్లు |
| లాంగ్‌జంప్ | 5.94 మీటర్లు |
| షాట్‌పుట్ | 12.11 మీటర్లు |
| జావెలిన్‌త్రో | 39.88 మీటర్లు |
| మొత్తం పాయింట్లు | 5712 |

ఆసియా క్రీడల్లో మరో ఏడు పతకాలు

# పతకాల హరివిల్లు

## తొమ్మిదో రోజు 3 రజతాలు 4 కాంస్యాలు



**ఆసియా క్రీడల్లో సెంచరీ కొట్టడమే లక్ష్యంగా భారత అథ్లెట్లు దూసుకెళ్తున్నారు. పోటీల తొమ్మిదో రోజు స్వర్ణం దక్కకపోయినా.. వేర్వేరు క్రీడాంశాల్లో కలిపి భారత్ ఖాతాలో 7 పతకాలు చేరాయి. లాంగ్‌జంప్‌లో అన్సీ సోజన్ కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో రజత పతకం కొల్లగొట్టగా.. 400 మిక్స్‌డ్ రిలేలో అజ్మల్, విద్య, రాజేశ్, సుభతో కూడిన భారత జట్టు వెండి కైవసం చేసుకుంది. మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పారుల్ చౌదరీ వెండి వెలుగులు విరజిమ్మగా.. ప్రీతి కాంస్యం గెలుచుకుంది. టీటీలో సుతీర్థ-ఐహిక జంట కంచుతో సరిపెట్టుకోగా.. స్పీడ్ స్కేటింగ్‌లో పురుషుల, మహిళల జట్లకు కాంస్య పతకాలు దక్కాయి. మొత్తంగా 60 మెడల్స్ ఖాతాలో వేసుకున్న భారత్ వంద పతకాల వైపు వడివడిగా అడుగులు వేస్తున్నది.**

### 400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో సిల్వర్



హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత్ జోరు కొనసాగుతున్నది. చైనా వేదికగా జరుగుతున్న పోటీల్లో సోమవారం మన అథ్లెట్లు ఏడు పతకాలు సొంతం చేసుకున్నారు. 400 మీటర్ల మిక్స్డ్ రిలే జట్టు చిరుతను తలపించే వేగంతో వెండి పతకం ఖాయం చేసుకుంది. తుదిపోరులో మహమ్మద్ అజ్మల్ (43.14 సెకన్లు), విద్య రామరాజ్ (54.19 సెకన్లు), రాజేశ్ రమేశ్ (45.77 సెకన్లు), సుభా వెంకటేశన్ (51.24 సెకన్లు) బృందం 3 నిమిషాల 14.34 సెకన్లలో లక్ష్యాన్ని చేరి మూడో స్థానంలో నిలిచింది. అయితే రెండో స్థానం దక్కించుకున్న శ్రీలంక అథ్లెట్లు పరుగు సమయంలో లైన్ దాటి అనర్హతకు గురి కావడంతో భారత్ కాంస్య పతకాన్ని రజతంగా ప్రకటించారు. ఈ రేసుకు ముందు అర్హత పోటీలో విద్య 55.42 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. దాంతో, అత్యంత వేగంగా 400 మీటర్లు పరుగెత్తిన భారతీయ మహిళగా 39 ఏళ్ల క్రితం పరుగుల రాణి పీటీ ఉష నెలకొల్పిన రికార్డును విద్య సమం చేసింది. 1984 ఒలింపిక్స్‌లో ఉష 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.42 సెకన్లలో పూర్తి చేసింది.

పెద్దగా అంచనాలు లేకుండా బరిలోకి దిగిన స్కేటింగ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాలు నెగ్గగా.. లాంగ్‌జంప్‌లో అన్సీ సోజన్ వెండి వెలుగులు విరజిమ్మింది. ఫలితంగా 9వ రోజు పోటీలు ముగిసేసరికి భారత్ 60 మెడల్స్ (13 స్వర్ణాలు, 24 రజతాలు, 23 కాంస్యాలు)తో పట్టికలో నాలుగో స్థానంలో ఉంది.

### బ్రిడ్జ్‌లో పతకం ఖరారు

బ్రిడ్జ్ పోటీలో భారత్‌కు పతకం ఖాయమైంది. పురుషుల జట్టు రౌండ్ రాబిన్ పద్ధతిలో 288.60 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి కనీసం కాంస్యం ఖాయం చేసింది. సెమీఫైనల్లో భారత జట్టు చైనాను ఢీ కొననుంది.

### అన్సీకి రజతం

ఆసియా చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న అన్సీ సోజన్ ఆసియా క్రీడల్లో అదరగొట్టింది. ఈ 22 ఏళ్ల కేరళ సంచలనం లాంగ్‌జంప్‌లో భారత్‌కు రెండో రజతం అందించింది. సోమవారం జరిగిన ఫైనల్లో ఐదో ప్రయత్నంలో సోజన్ శక్తినంతా కూడదీసుకొని 6.63 మీటర్ల దూరం దూకి రజత పతకాన్ని ముద్దాడింది. అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచిన సోజన్.. స్వర్ణం గెలిచిన షికీ గ్జియాంగ్ కంటే 10 సెంటీమీటర్లు వెనుకబడి పసిడి దూరం చేసుకుంది. ఇదే విభాగంలో పోటీపడ్డ మరో భారత లాంగ్‌జంపర్ షైలీ సింగ్ ఫైనల్లో సత్తా చాటలేకపోయింది. ఐదో ప్రయత్నంలో 6.38 మీటర్ల దూరం మాత్రమే దూకి నిరాశ పరిచింది.

### స్టీపుల్ చేజ్‌లో డబుల్



మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత అథ్లెట్లు రెండు పతకాలు కైవసం చేసుకున్నారు. పారుల్ చౌదరీ 9 నిమిషాల 27.63 సెకన్లలో రేసు పూర్తి చేసి వెండి పతకం చేజిక్కించుకుంది. రేసు ఆరంభం నుంచే దూసుకెళ్లిన పారుల్.. పసిడి నెగ్గిన బహ్రెయిన్ అథ్లెట్ యవి విన్‌ఫ్రైడ్ కంటే 9 సెకన్లు వెనుక ఉండిపోయింది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న పారుల్ ఏషియన్ గేమ్స్‌లోనూ అదే జోరు కనబర్చినా.. బంగారు పతకాన్ని మాత్రం తృటిలో కోల్పోయింది. ఇక ఇదే విభాగంలో భారత మరో అథ్లెట్ ప్రీతి 9 నిమిసాల 43.32 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్య పతకం గెలిచింది. దీంతో ఈ విభాగంలో భారత్‌కు రజత, కాంస్యాలు దక్కాయి.

### రెండు కాంస్యాలు మనవే!



ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన స్కేటింగ్ జట్లు ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండు పతకాలు అందించాయి. స్పీడ్ స్కేటింగ్ 3వేల మీటర్ల రీలేలో భారత అబ్బాయిలు, అమ్మాయిలు చెరొక పతకంతో మెరిశారు. పురుషుల స్పీడ్ స్కేటింగ్ 3వేల మీటర్ల రీలేలో ఆర్యన్‌పాల్ సింగ్ ఘుమన్, అనంద్ కుమార్ వెల్కుమార్, సిద్ధాంత్ రాహుల్ కాంబ్లే, విక్రమ్ రాజేంద్ర బృందం 4 నిమిషాల10.12 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం అందుకుంది. చైనీస్‌తైపీ (4 ని.19.44 సె), దక్షిణా కొరియా (4ని.21.14సె) వరుసగా స్వర్ణ, రజతాలు దక్కించుకున్నాయి. మహిళల జట్టు అంచనాలకు మించి రాణించి కాంస్య పతకం దక్కించుకుంది. సంజన బథులా, కార్తీక జగదీశ్వరన్, హీరాల్ సాధు, హారతి కస్తూరి రాజ్ బృందం 3వేల మీటర్ల రీలేలో 4 నిమిషాల 34.86 సెకన్లలో లక్ష్యాన్ని చేరింది.

## ఇలాంటి వ్యాఖ్యలు తగునా!

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో కాంస్య పతకంతో మెరిసిన తెలంగాణ యువ అథ్లెట్ అగసర నందినిపై.. భారత్‌కే చెందిన మరో అథ్లెట్ స్వప్న బర్మన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. 19వ ఏషియన్ గేమ్స్ హెప్టాథ్లాన్‌లో నందినితో కలిసి బరిలోకి స్వప్న.. 5708 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం స్వప్న బర్మన్ సోషల్ మీడియాలో.. 'ట్రాన్స్‌జెండర్ మహిళ చేతిలో నేను కాంస్య పతకం కోల్పోయా'అని పేర్కొంది. 2018 జకార్తా క్రీడల్లో హెప్టాథ్లాన్‌లో స్వర్ణం నెగ్గిన బర్మన్ ట్వీట్ వైరల్‌గా మారగా.. కొన్ని గంటల తర్వాత దాన్ని డిలీట్ చేసింది. దీనిపై భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షుడు సుమరివాలాను సంప్రదించగా.. ఆయన స్పందించేందుకు నిరాకరించారు. ఈ అంశంపై నందిని మాట్లాడుతూ.. 'నాకేం అర్థం కావడం లేదు. ఆమెకు ఏదైనా ఇబ్బంది ఉంటే ముందే ఎందుకు చెప్పలేదు. కష్టపడి కాంస్య పతకం నెగ్గిన తర్వాత ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరం. నేను దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలనే శ్రమించా' అని పేర్కొంది.

## టీటీలో నవశకం



భారత టేబుల్ టెన్నిస్ (టీటీ)లో బెంగాల్ ప్యాడ్లర్లు సుతీర్థ ముఖర్జీ-ఐహిక ముఖర్జీ చరిత్ర సృష్టించారు. సోమవారం మహిళల డబుల్స్ సెమీఫైనల్లో సుతీర్థ-ఐహిక జోడీ 3-4 (11-7, 8-11, 11-7, 8-11, 9-11, 11-5, 2-11)తో చా సుయెంగ్-పాక్ సుగ్‌యాంగ్ (ఉత్తర కొరియా) ద్వయం చేతిలో పోరాడి ఓడింది. హోరాహోరీగా సాగిన ఏడు గేమ్‌ల పోరులో మనవాళ్లు సత్తాచాటినా.. కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టిన కొరియన్లు ఫైనల్‌కు చేరారు. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ చైనా జోడీని మట్టికరిపించిన భారత జంట.. సెమీస్‌లో అలాంటి ప్రదర్శనే చేసే ప్రయత్నం చేసినా ఫలితం మాత్రం భిన్నంగా వచ్చింది. కాగా.. టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 147 | 81 | 42 | 270 |
| 2 | జపాన్ | 33 | 44 | 45 | 122 |
| 3 | కొరియా | 31 | 39 | 63 | 133 |
| 4 | భారత్ | 13 | 24 | 23 | 60 |
| 5 | చైనీస్ తైపీ | 12 | 10 | 17 | 39 |
| 6 | ఉజ్బెకిస్థాన్ | 11 | 14 | 18 | 43 |

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర- రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

### సెమీస్‌లో హాకీ జట్టు

ఆసియా క్రీడల్లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత పురుషుల హాకీ జట్టు.. తమ విధ్వంసకర ఆటతీరుతో ప్రత్యర్థులను హడలెత్తిస్తున్నది. ఇప్పటికే సింగపూర్, పాకిస్థాన్‌పై భారీ తేడాతో గెలిచిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన సోమవారం బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది. కెప్టెన్ హర్మన్ , మన్దీప్ హ్యాట్రిక్ గోల్స్ కొట్టడంతో భారత్12-0తో బంగ్లాను మట్టికరిపించింది. తద్వారా పూల్-'ఎ'లో ఓటమి ఎరగని భారత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. భారత జట్టు ఇప్పటివరకూ ఆడిన ఐదో మ్యాచ్‌ల్లో రికార్డు స్థాయిలో 58 గోల్స్ కొట్టడం విశేషం.

## ఏషియన్ గేమ్స్‌లో ఎగిరిన తెలంగాణ జెండా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో తెలంగాణ అథ్లెట్లు సత్తాచాటి.. రాష్ట్రం గర్వపడే విజయాలు సాధించారని సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో చైనా వేదికగా జరిగిన ఏషియన్ గేమ్స్‌లో తెలంగాణ ప్రతిభకు పతకాలు పాదాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. షూటింగ్‌లో ఇషా సింగ్, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, అథ్లెటిక్స్‌లో అగసర నందిని రాణించి.. యువతలో కొత్త ప్రేరణ నింపారని అన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని సహకారం అందించిందని.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడంలో సీఎం కేసీఆర్ సర్కార్ ఎల్లప్పుడూ ముందుంటుందని సాట్స్ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కాప్రాలో సంబురాలు..



కాప్రా, అక్టోబర్ 2: ఆసియా క్రీడల్లో కాంస్య పతకం నెగ్గిన అగసర నందిని ఇంట్లో సంబురాలు అంబరాన్ని అంటాయి. చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న ఏషియన్ గేమ్స్ మహిళల హెప్టాథ్లాన్ పోటీల్లో నందిని కాంస్యం సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన నందినిపై ప్రశంసల వర్షం కురుస్తున్నది. కాప్రా చంద్రపురి కాలనీలోని నందిని నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. జాతీయ క్రీడల్లో ఎన్నో పతకాలు సాధించిన నందిని అంతర్జాతీయ స్థాయిలో మెరవడంతో కాలనీవాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ.. నందిని తల్లిదండ్రులు అయ్యమ్మ, ఎల్లప్పను అభినందించారు.

## ఇంగ్లండ్, కివీస్ విజయాలు




న్యూఢిల్లీ: భారీ వర్షాల మధ్య సాగుతున్న వన్డే ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ విజయాలు సాధించాయి. సోమవారం గువాహటి వేదికగా జరిగిన పోరులో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలుపొందగా.. తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్‌లు డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారమే ముగియడం గమనార్హం. వర్షం కారణంగా మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించగా.. బంగ్లాదేశ్ 9 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. మెహదీ హసన్ (74), తన్జిద్ (45) రాణించారు. ఛేదనలో స్పిన్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ (56; 2 ఫోర్లు, 6 సిక్సర్లు) దుమ్మురేపడంతో 197 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 24.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

## సౌరాష్ట్ర 212/9

### రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్

రాజ్‌కోట్: దేశవాళీ టోర్నీ ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియా జట్టు ఆధిక్యం దిశగా సాగుతున్నది. మొదట రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 308 పరుగులు చేయగా.. సోమవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 9 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. టీమిండియా టెస్టు స్టార్ చతేశ్వర్ పుజారా (29) పెద్దగా ఆకట్టుకోలేకపోగా.. అర్పిత్ (54) హాఫ్‌సెంచరీతో రాణించాడు. రెస్టాఫ్ బౌలర్లలో విద్వత్, సౌరభ్ కుమార్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. చేతిలో ఒక వికెట్ మాత్రమే ఉన్న సౌరాష్ట్ర జట్టు.. రెస్టాఫ్ ఇండియా స్కోరుకు ఇంకా 96 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (17 నాటౌట్) పోరాడుతున్నాడు.

## ఇదైనా సాగేనా!

### నేడు భారత్, నెదర్లాండ్స్ వార్మప్ మ్యాచ్




తిరువనంతపురం: వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా భారత జట్టు రెండో వార్మప్ మ్యాచ్‌కు సిద్ధమైంది. మంగళవారం తిరువనంతపురం వేదికగా నెదర్లాండ్స్‌తో రోహిత్ సేన తలపడనుంది. ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి వార్మప్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. గువాహటి నుంచి సోమవారమే భారత జట్టు తిరువనంతపురం చేసుకుంది. అయితే ఈ మ్యాచ్‌కు కూడా వర్ష సూచన ఉండటం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి ముందు ప్లేయర్లకు మ్యాచ్ ప్రాక్టీస్ దక్కాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న వార్మప్ మ్యాచ్‌లు ఇలా వర్షార్పణం కావడంపై ప్లేయర్లు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టీమ్ ఇండియాకు ప్రయాణాలతోనే సరిపోతున్నది. సోమవారం ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్ ఉండగా.. భారత ప్లేయర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. టీమ్‌ఇండియా స్టార్ విరాట్ కోహ్లీ మాత్రం బీసీసీఐ అనుమతితో గువాహటి నుంచి తిరువనంతపురం కాకుండా.. వ్యక్తిగత అత్యవసర కారణాల వల్ల ముంబై వెళ్లినట్లు సమాచారం. కోహ్లీ భార్య అనుష్క శర్మ రెండోసారి తల్లి కాబోతున్నదని.. అందుకే విరాట్ అత్యవసరంగా దవాఖానాకు వెళ్లాల్సి వచ్చిందనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ప్రాక్టీస్ సెషన్‌కు దూరమైన విరాట్.. మంగళవారం ఉదయం తిరువనంతపురం చేరుకుంటాడని బోర్డు వెల్లడించింది. నెదర్లాండ్స్‌తో వార్మప్ మ్యాచ్‌లో కోహ్లీ పాల్గొంటాడని తెలిపింది. అయితే తిరువనంతపురంలో వాతావరణ పరిస్థితులు మ్యాచ్‌కు అనుకూలంగా లేవని తేలిపోయింది. సోమవారం ఇక్కడ జరిగిన పోరుకు వర్షం అడ్డు పడింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.